కన్సలేషన్ బహుమతి పొందిన కథ.
● 'లాయర్' రజతోత్సవ ప్రత్యేక సంచిక. 2006

# వృత్తి ధర్మం

అప్పన్న కొండమీదనించి భక్తి సంగీతం లీలగా వినిపిస్తోంది. మార్గశిరమాసం. తెలిమంచు తెరలింకా పూర్తిగా విడిపోలేదు. అప్పటికే స్నానాది కార్యక్రమాలను ముగించుకొని వీధరుగు మీది తాటాకు చాపమీద కూర్చొని జంధ్యాలు వడుకుతున్నాడు గణపతిశాస్త్రి. అతని పక్కనున్న చిన్న చేతి సంచిలో నాలుగు రకాల పంచాంగ పుస్తకాలూ, జంధ్యాలూ, దర్భల కట్టా వున్నాయి.

కొబ్బరాకుల సందుల్లోంచి పల్చని ఎండ వీధి మెట్లమీద పడుతోంది. ఏం చేయడానికీ పాలుపోని స్థితిలో ఆలోచిస్తున్నాడతడు. సుమారొక నెలరోజుల నించీ ఏ పనీ లేదు - ఒకప్పుడు పెళ్ళిళ్ళూ, బాలసారెలూ, గృహప్రవేశాలతో తీరిక లేకుండా గడిచిపోయేది - ఇప్పుడు కుర్ర బ్రాహ్మలెందరో తనకు పోటీగా వచ్చారు. తను పౌరోహిత్యం చేసే పాతఇళ్ళు పోయేయి. కొత్త ఇళ్ళు రావటంలేదు. రెండునెలల వరకూ భుక్తికి ఢోకాలేదనుకొనే పాతరోజులు పోయి పూటగడవని స్థితి ఏర్పడింది. ఇంట్లో వుండే గ్రాసం ఖర్చయిపోయినట్లు రాత్రే నెమ్మదిగా తెలియపర్చింది సోమిదేవమ్మ.

వీధిలో- పెద్దచప్పుడు చేసే చిన్నమోటార్ సైకిల్ మీద పేరిశాస్త్రి వెళ్ళిపోతున్నాడు. ఎర్రపంచా, ఆకుపచ్చ శాలువా, కళ్ళజోడూ, మొలలో సెల్‌ఫోనూ- ఎప్పుడూ ఏదో హడావుడిగానే వుంటాడు.

"చూశారుగా అతగాడినీ. ఆ లౌక్యమూ, తెలివితేటలూ, వేషభాషా... ఈ కాలంవారికి కావాల్సినట్టుగా వుండి సంపాదించుకుంటున్నాడు." సన్నగా వెనుకనుండి గొణిగే సోమిదేవమ్మ వంక చూశాడు, గణపతిశాస్త్రి.

"నేనలా వుండలేను. చేయనూలేను. నా వృత్తినాకు కొన్ని ధర్మాల్నీ కొంత సత్ ప్రవర్తననీ నేర్పింది. చేయవలసిన పని చేయకుండా... ఏదో తూతూ మంత్రంగా జరిపించేసి అన్యాయంగా ఆర్జించడం నా వల్లకాదు. ఆనాగరికత నాకు చెల్లదు"- కాస్త కోపంగానే అన్నాడు. సోమిదేవమ్మ లోపలికి వెళ్ళిపోయింది.

గణపతిశాస్త్రి బళ్ళో అట్టే చదువుకోలేదు- తొమ్మిదో ఏటనే తండ్రిపోతే బతుకు తెరువుకు మరో మార్గంలేక వృత్తికి పనికొచ్చే ప్రవర, చూర్ణిక, మహాసంకల్పం, మంగళాష్టకాలూ సంప్రదాయ రీతిలో గురువుల వద్ద ముఖతః నేర్చుకుని వృత్తిలోకి దిగేడు. అందులో పురోభివృద్ధి సాధించి 'దిట్ట' అన్పించుకున్నాడు- తనకున్న విద్వత్తును సక్రమంగా నిజాయితీగా వినియోగించుకుని జీవనంకోసం సంపాదించుకోవడమే గాని మరోలా ఆర్జించడం తెలియదు - తనకొడుకు తనలా వృత్తిలోకి రాలేదు- బ్రతుకుబాట చూపని కాలేజీ చదువేదో చదివేడు - అతగాడు జీవితంలో స్థిరపడేదెప్పుడో మరి! కులాల సమరంలో అతను ఓడిపోని సమయం లేదు. నిరాశా నిస్పృహలు వెంటాడని రోజు లేదు. కులమతాల సరిహద్దుల్ని చెరిపేసే రోజులు వస్తేనేగానీ తమవంటి దారిద్ర్యరేఖకు కాస్త అటు ఇటుగా వుండేవారి జీవితాలలో వెలుగుపూలు పూయవని గణపతిశాస్త్రికి గట్టినమ్మకం.

"నమస్కారమండీ" ఆడగొంతు విన్పిస్తే తలెత్తి చూశాడు గణపతిశాస్త్రి. ఎవరో అమ్మాయి. ముప్ఫైయేళ్ళ వయసుంటుంది. "గణపతిశాస్త్రి గారంటే..." అంటూ ఆగింది.

"నేనేనమ్మా. లోపలకి రా" అంటూ తను కాస్త తప్పుకొని ఆమె కూర్చోవడానికి చోటుచూపించాడు. ఆమె తనెవరో చెప్పి, వచ్చిన పనేమిటో చెప్పింది. పేరు కృష్ణప్రియ.

నగరంలో వున్న ఒక పెద్దబట్టల షాపులో పనిచేస్తోంది. ఇటీవలే తండ్రిపోయాడు. కనక తల్లి, చెల్లి, తమ్ముడి బాధ్యత తనదేనట - చెల్లెలికి సంబంధం కుదిరింది- అత్యవసరంగా పెళ్లి చెయ్యాలిట. తనకున్న ఆర్థిక ఇబ్బందులు, అప్పులదృష్ట్యా అతి సాధారణరీతిలో పెళ్ళి చేయాలనుకుంటున్నానని ఖర్చు స్వల్పంలో తేలిపోవాలనీ చెప్పి "అందుకు సమర్ధులైన వారు మీరేనని ఎవరో మీ పేరును సూచించేరు." అందామె.

'ఇంకెవరూ? పేరిశాస్త్రే అయివుంటాడు - అతనికిది లాభసాటి బేరంకాదు మరి' అనుకున్నాడు గణపతిశాస్త్రి.

అయితే కృష్ణప్రియ పరిస్థితీ తన పరిస్థితిలాగే దయనీయంగా వుంది. ఏవో తప్పనిసరి పరిస్థితుల్లో చెల్లిలికి పెళ్ళిచేయ్యాలనుకుంటున్నదేగానీ ఆర్థిక పరిస్థితి బొత్తిగా బాగాలేదు. పెళ్ళికొడుక్కి తల్లిదండ్రులు లేరుగనుక రెండువైపులా తానే నిలబడి పెళ్ళి చెయ్యాలట - చూడబోతే చితికిపోయిన బ్రాహ్మణపిల్లే. సమస్యల్లో చిక్కుకుని తన దగ్గర కొచ్చింది.

'చూడమ్మా నా కూతురులాంటి దానివి. నాకు తోచిన సలహా ఇచ్చి చేయగలిగిన సాయం చేస్తాను. నీకు అంగీకారమైతేనే చెయ్యి. లేదా నీ ఇష్టం" అన్నాడు-

ఆ అమ్మాయి- కాస్త ఆలంబన దొరికినట్టే సంతోషంగానే తలూపింది.

"పెళ్లి ఎలా చేయాలో తర్వాత ఆలోచించినా ఎక్కడ చేయాలో ముందు ఆలోచించాలి గదా. కళ్యాణమంటపాల అద్దెలు ఇప్పుడు మనలాంటి వారికి అందుబాటులో లేవు. అప్పన్న దేవుడి సత్రంకి ఆనుకుని వున్న రెండు మంటపాల్లో ఒకటి చిన్నదీ, పురాతనమైనదీ. కొన్నివందల వేల పెళ్ళిళ్ళు అక్కడ జరిగాయి. అందులో ఓ పాతికపెళ్ళిళ్లు నేనే అక్కడ జరిపించాను. నేను మాట్లాడితే కాదనరనే నమ్మకం వుంది. పెళ్ళికి అతి ముఖ్యుల్ని పిలుచుకోండి, ఆడంబరాలకు హద్దేముందీ? ఈ రోజుల్లో ఒక్క రోజు పెళ్ళికి కొన్ని కోట్లరూపాయలు ఖర్చు చేస్తున్నారని వార్తల్లో చూస్తున్నాం. పెళ్ళికొచ్చిన ఆ ముఖ్యులికి శుభ్రమైన భోజనంపెడదాం. ఏ కేటరింగ్ వారికి చెప్పినా ఇప్పుడు విస్తరి ఏభై అరవై రూపాయలకు తక్కువ వుండటం లేదు. బిరియానీలు, కచంబర్లూ లేకపోయినా పూర్ణంబూరె, పులిహోరలతో భోజనం ముప్పై ఐదు రూపాయలకే ఏర్పాటు చేయిద్దాం. మా కాలంనాటి వంటాయన ఒకడున్నాడు. మాట్లాడమంటే మాట్లాడతాను. పోతే-పెళ్ళికి కొనే బట్టల్లో అతిముఖ్యమయినవి మధుపర్కాలు, ఒక పెళ్ళిపట్టుచీర. కర్పూరపు దండలు, పూలదండలు, పెళ్ళితంతు సామగ్రీ స్వల్పంలోనే సమకూర్చుకోవచ్చు. ఇక శతమానం. బంగారుపుస్తెలు కొనలేకపోతే పసుపుకొమ్ము చాలు. ముప్పైఏళ్ళ క్రితం పసుపుకొమ్ముతోనే నా భార్యను గుళ్ళో పెళ్లి చేసుకున్నాను. ఈ నాటికీ ఒకేమాట. పూటగడవక పస్తున్నా పల్లెత్తుమాట అనదు. అనుకోదు.

పసుపుతాడైనా, పసిడి పుస్తెలైనా అవి మనసుల్నీ మనుషుల్నీ ముడివేసే బంధాలే అవ్వాలి. ఆ సుముహూర్తం అందుకే. అదే దాని బలం!

కనుకొలుకుల్లో నీరు జారుతుంటే ఆనందంగా ఔనన్నట్లు తలూపిందా అమ్మాయి.

"ఇక మంగళధ్వని కోసం సన్నాయివాడికి చెబుతాను - మూడు నాలుగు వందల్లో వస్తాడు. అది తప్పదు. ఈ రోజుల్లో పెళ్ళికి బేండుగాని, సన్నాయిమేళం గానీ ఐదువేలకి తక్కువ రావటంలేదు. సరేనా" అంటూ ఆగేడు గణపతిశాస్త్రి.

"నా అదృష్టంకొద్దీమీవంటి పెద్దలు నాకు తారసపడ్డారు. మీ పురోహిత కట్నం కూడా చెబితే..." అంటూ ఆగిందామె.

"నాదేముంది? నీ కెంతతోస్తే అంతివ్వు. ఈ రోజుల్లో ఆడపెళ్ళివారి వైపో, మగపెళ్ళివారి వైపో ఒకవైపు కుదిరితేనే మూడునాలుగువేలు పుచ్చుకుంటున్నారు- ఇచ్చేవారి అంతస్తును బట్టీ; అడిగేవారి ఆకలిని బట్టినూ. ఇరువైపులా నన్నే చూడమన్నావు. ఇవ్వగలిగితే వెయ్యినూట పదహార్లివ్వు- వృత్తయినా భుక్తయినా ఇదేకదా మాకు- ఆ పైన నీ యిష్టం. కొండంత కుటుంబభారాన్ని మోస్తున్నావ్. చిన్న పిల్లవు. నిన్ను చూస్తే జాలేస్తోంది" అన్నాడు.

కృష్ణప్రియ వంగి గణపతిశాస్త్రి పాదాలకు నమస్కరించి లేచి, తన పర్సుతీసి ఓ నూటపదహార్లు తీసి ఆయనకందించి "ఈ శుభకార్యాన్ని మీరే జరిపించాలి" అంది.

"శుభం" అన్నాడు గణపతిశాస్త్రి- నట్టింట్లో గోడకానుకొని కూర్చున్న సోమిదేవమ్మ ముఖంలో ఆనందరేఖలు పరచుకున్నాయి.

◆ ❖ ◆

గుడిలో గంటలు మ్రోగేయి. పెళ్ళిమంటపంలో మంగళధ్వనులు మ్రోగేయి. సుముహూర్తంలో వధూవరులు శిరసులమీద జీలకర్ర, బెల్లం అమిరేయి. మూడు ముళ్ళూ పడ్డాయి. దండలమార్చుకోవటం జరిగింది - ఆ పెళ్ళికి ఆత్మీయులైన బంధుమిత్రులే వచ్చారు. కృష్ణప్రియ పనిచేసే బట్టలషాపు యజమాని రమాకాంతరావు వచ్చాడు - వధూవరుల పెళ్ళి బట్టలన్నీ ఆయనే పెళ్ళికానుకగా ఇచ్చాడు. వధూవరులకు పెద్దల ఆశీస్సులు, పెద్దలకు వధూవరుల నమస్కారాలూ వంటివాటిని దగ్గరుండి జరిపించాడు గణపతిశాస్త్రి. ఆ తర్వాత భోజనాల కార్యక్రమాన్ని దగ్గరుండి కృష్ణప్రియ నిర్వహించింది. 'అసలైన తెలుగింటి పెళ్ళి భోజనం' అన్నారంతా.

కార్యక్రమమంతా పూర్తయ్యాకగణపతిశాస్త్రికి తాంబూలంలో వెయ్యినూటపదహార్లు పెట్టి చేతికందిస్తూ "మానాన్న కూడా నా పట్ల యింతదయగా ఎన్నడూ ప్రవర్తించలేదు. మీ రుణం తీర్చుకోలేనిది. మిమ్మల్ని మరోసారి సత్కరించుకొనేభాగ్యం కలుగజెయ్యండి" అంటూ అతని కాళ్ళకు నమస్కరించింది కృష్ణప్రియ.

"ఇందులో నేను చేసిందేం లేదు- సాటి మనిషిగా నాకు చేతనైనదే చేశాను- కార్యక్రమం జరిపించినందుకు నేనడిగిన ఫీజు నాకు ఇవ్వనే ఇచ్చావు" అంటూ ఆమెను మనసారా ఆశీర్వదించి, "నాకు నువ్వు ఎక్కువగా ఇచ్చిన ఈ నూటపదహార్లనూ నూతన వధూవరులకు కానుకగా ఇస్తున్నాను" అని నూటపదహార్లను తీసి ఆమెకందించాడు. శాస్త్రిచర్యకు మాటలేని శిలాప్రతిమే అయ్యింది కృష్ణప్రియ.

◆ ❖ ◆

మర్నాడు ఉదయం పదకొండు గంటలవేళ ఓ పాతికేళ్ళ కుర్రాడు గణపతిశాస్త్రి ఇంటిని వెతుక్కుంటూ వచ్చాడు. అతను కృష్ణప్రియ పనిచేసే బట్టలకొట్లోనే పనిచేస్తాడట. "రమాకాంతరావు గారు మిమ్మల్నోమారు రమ్మన్నారు" అంటూ తానొచ్చిన పనిని పూర్తిచేశాడు. ఒకవంక ఆనందమూ మరొవంక విస్మయమూ కలిగాయి గణపతిశాస్త్రికి. ఖద్దరు లాల్చీ, పైమీద కండువా వేసుకొని అతని వెంట బయల్దేరాడు.

పట్నంలోకెల్లా పెద్ద బట్టలషాపది. అందులో ఓ మూల ఓ చిన్న ఎయిర్‌కండిషన్డ్ గదిలో రమాకాంతరావు కూర్చొనివున్నాడు. అతనికెదురుగా కృష్ణప్రియ కూర్చొనివుంది. గణపతిశాస్త్రి రావడంతోనే రమాకాంతరావు నవ్వుతూ ఆహ్వానించి, కూర్చోమని కుర్చీ చూపించాడు. ఒకబ్బాయి కప్పుతో కాఫీ తెచ్చి అతనిముందుంచాడు - గణపతి శాస్త్రికేం అర్థంకాలేదు.

"మీరు చేసిన సహాయం గురించి కృష్ణప్రియ అంతా చెప్పింది శాస్త్రిగారూ. ఈ పెళ్ళి చేయడంలో ఆమెకు మీరు దేవుడిలా సాయపడ్డారు - వృత్తులన్నీ వ్యాపార రీతిలో నడుస్తున్న యీ రోజుల్లో పవిత్రమైన యీ వృత్తిని ఎంచుకొని జీవిస్తున్న మీరు ఎంతో నిజాయితీగా సేవాభావంతో నిర్వహిస్తున్నారంటే నిజంగా చాలా సంతోషమనిపించింది. విద్య వినయాన్నీ, మంచి గుణాల్నీ ఇస్తుందని చిన్నప్పుడు పద్యాల్లో చదువుకున్నాను- దాని విలువేమిటో ఇప్పుడు బోధపడింది. ఈ సందర్భంలో నాదో చిన్నకోరిక మీరు కాదనకూడదు. "అంటూ ఆగేడు. అర్థంకానట్టు అతని వంక చూశాడు గణపతిశాస్త్రి. "మా షాపులో రోజూ పూజ జరిపించే సుబ్రమణ్యం ఉద్యోగమొచ్చి వెళ్ళిపోయాడు. ఇక మీదట మీరా కార్యక్రమాన్ని జరిపించాలని నా కోరిక. నెలనెలా మాకు తోచింది ఇస్తాం. దాన్ని జీతం అనలేను" అంటూ చేతులు జోడించేడు.

గణపతిశాస్త్రి నమ్మలేని ఆనందంతో "అలాగే కానీండి" అన్నాడు. తాంబూలం, పంచెల చాపూ, ఓ మూడొందల రూపాయలూ చేతిలో వుంచాడాయన.

విషయం తెలుసుకున్న సోమిదేవమ్మ "మనం మనకంటే సమస్యల్లో వున్నవారికి సాయపడితే మనకి సాయం మరోలా అందుతుంది" అంది ఆనందంగా.

◆ ❖ ◆